క్లుప్తంగా

వేములవాడకు ప్రత్యేక బస్సులు

ఆర్మూర్‌టౌన్‌: ఆర్మూర్ ఆర్టీసీ ఆధ్వర్యంలో మహాశివరాత్రి సందర్భంగా వేములవాడకు ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్లు డిపో మేనేజర్ రవికుమార్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వేములవాడకు వెళ్లే బస్సులకు మహాలక్ష్మి స్కీం వర్తిస్తుందన్నారు. బుధవారం నుంచి శుక్రవారం వరకు ప్రత్యేక బస్సులను నడుపుతున్నట్లు ఆయన పేర్కొన్నారు. భక్తులు, ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించాలి

ఆర్మూర్‌టౌన్‌: రాష్ట్ర ప్రభుత్వం పెండింగ్ బిల్లులు, డీఏ బకాయిలు తక్షణమే విడుదల చేయాలని డెమోక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ ఆర్మూర్ మండల కమిటీ అధ్యక్షుడు విజయ్ కుమార్ డిమాండ్ చేశారు. విద్యారంగానికి అధిక నిధులు కేటాయించడంతో పాటు, వెంటనే విద్యాశాఖ మంత్రిని నియమించాలని కోరారు. సమగ్ర శిక్ష ఉద్యోగుల 29 రోజుల సమ్మె కాలం వేతనాలను విడుదల చేయాలని అన్నారు.

కాంగ్రెస్‌కు పట్టభద్రుల ఓటు అడిగే హక్కు లేదు

పెర్కిట్: అధికారంలోకి వచ్చిన వెంటనే ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేస్తానని చెప్పిన సీఎం రేవంత్ రెడ్డికి బీసీ, ఎస్సీ, ఎస్టీ పట్టభద్రులను ఓటు అడిగే హక్కు లేదని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి జీవీ నర్సింహారెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గత ప్రభుత్వంతో పాటు ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయకపోవడంతో బీసీ, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. ప్రభుత్వం వెంటనే ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

ఘనంగా సంత్ గాడ్గె జయంతి



నివాళులు అర్పిస్తున్న సభ్యులు

బాల్కొండ: బాల్కొండ మండల కేంద్రంలో రజక సంఘం ఆధ్వర్యంలో ఆదివారం సంత్ గాడ్గె జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకుడు కుందారపు శ్రీనివాస్, రజక సంఘ సభ్యులు వినేశ్, రమేశ్, చంద్రశేఖర్,బొర్రక్క రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఇష్టపడి చదవాలి



గురువును సన్మానిస్తున్న అనిల్, సునీల్

బాల్కొండ: విద్యార్థులు ఇష్టపడి చదివి అనుకున్న లక్ష్యాన్ని సాధించాలని టీఎస్ఎండీసీ చైర్మన్ ఈరవత్రి అనిల్, కాంగ్రెస్ బాల్కొండ నియోజకవర్గ ఇన్‌చార్జి ముత్యాల సునీల్ రెడ్డి అన్నారు. శనివారం రాత్రి మండలంలోని కిసాన్‌నగర్‌లో సెయింట్ థెరిసా పాఠశాల 60వ వసంతాల వేడుకల్లో ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తాము చదువుకున్న పాఠశాలకు ముఖ్య అతిథులుగా రావడం గర్వంగా ఉందన్నారు. అనంతరం తమకు చదువు నేర్పిన గురువులను సన్మానించారు. విద్యార్థులు చేసిన నృత్యాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఎంఈవో రాజేశ్వర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఘనంగా కళాశాలల వేడుకలు



విజేత కళాశాలలో నృత్యం చేస్తున్న విద్యార్థినులు

బోధన్‌టౌన్: పట్టణంలోని విజేత, సాయి విజేత జూనియర్ కళాశాలల సిల్వర్ జూబ్లీ వేడుకలను ఆదివారం కళాశాల ఆవరణలో వైభవంగా నిర్వహించారు. ఈ సిల్వర్ జూబ్లీ వేడుకల్లో కళాశాలలో విద్యనభ్యసించిన పూర్వ విద్యార్థులు హాజరయ్యారు. తమకు పాఠాలు బోధించిన అధ్యాపకులను, కళాశాల కరస్పాండెంట్ అంజనాదేవి, చైర్మన్ రమణారెడ్డిలను ఘనంగా సన్మానించారు. అనంతరం విద్యార్థులు చేసిన నృత్యాలు ఆకట్టుకున్నాయి. వేడుకలకు ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి హాజరై మాట్లాడారు. విద్యార్థులు శ్రద్ధగా చదువుకొని మంచి ఉత్తీర్ణత శాతాన్ని సాధించాలని సూచించారు. వేడుకల్లో ట్రస్మా జిల్లా అధ్యక్షుడు కొడాలి కిశోర్‌కుమార్, అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్‌కు సన్నద్ధం

- ఏర్పాట్లపై సమీక్షించిన సబ్ కలెక్టర్ వికాస్ మహతో
- పోలింగ్ ప్రక్రియ నిర్వహణపై అధికారులకు దిశా నిర్దేశం



బోధన్ సబ్ కలెక్టర్ కార్యాలయం



కార్యాలయంలో పట్టభద్రులు, ఉపాధ్యాయ ఓటర్ల స్లిప్పులను సిద్ధం చేస్తున్న ఉద్యోగిని

బోధన్: బోధన్ రెవెన్యూ డివిజన్‌లో శాసన మండలి ఎన్నికల ప్రక్రియలో భాగంగా పోలింగ్ నిర్వహణకు అధికార యంత్రాంగం సన్నద్ధమైంది. ఈ నెల 27న కరీంనగర్, ఆదిలాబాద్, మెదక్, నిజామాబాద్ పట్టభద్రులు, ఉపాధ్యాయ నియోజకవర్గ ఎన్నికకు పోలింగ్ ప్రక్రియ సజావుగా పూర్తి చేసేందుకు అధికారులు ఏర్పాట్లల్లో నిమగ్నమయ్యారు. శనివారం బోధన్ పట్టణ కేంద్రంలోని తన కార్యాలయంలో సబ్ కలెక్టర్ వికాస్ మహతో డివిజన్ స్థాయి ప్రభుత్వ వివిధ శాఖల అధికారులతో ఏర్పాట్లపై సమీక్షించారు. రవాణ శాఖ ఎంవీఐ శ్రీనివాస్, ఏసీపీ శ్రీనివాస్, ఆయా మండలాల తహసీల్దార్లు పాల్గొనగా సబ్ కలెక్టర్ దిశా నిర్దేశం చేశారు. డివిజన్ పరిధిలో ఉన్న బోధన్ పట్టణం, సాలూర, ఎడపల్లి, రెంజల్, రుద్రూర్, పొతంగల్, వర్ని, కోటగిరి, మోస్రా, చందూర్ మండలాల్లో పట్టభద్రులు, ఉపాధ్యాయ నియోజకవర్గాలకు సంబంధించి వేర్వేరుగా పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నారు. బోధన్ నియోజకవర్గ పరిధిలోని నవీపేట మండలం నిజామాబాద్ రెవెన్యూ డివిజన్ పరిధిలో ఉంది. పోలింగ్ ప్రక్రియ మొదలు బ్యాలెట్ బాక్స్‌లో కరీంనగర్ జిల్లా కేంద్రంలోని సంబంధిత కార్యాలయ రిసిప్షన్ సెంటర్‌కు పంపించే వరకు పకడ్బందీ చర్యలు తీసుకుంటున్నారు.

కళాశాల, పాఠశాలల్లోనే..

బోధన్ పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల, సాలూర మండల కేంద్రంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల మినహా మిగిలిన మండల కేంద్రాల్లో జడ్పీహెచ్ఎస్‌లో పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి. డివిజన్‌లో పట్టభద్రుల ఓటర్లు 5031, ఉపాధ్యాయ ఓటర్లు 701 మంది ఉన్నారు. పోలింగ్ కేంద్రాలు పది ఉన్నాయి.

మండలాలు	పట్టభద్రుల ఓటర్లు			ఉపాధ్యాయ ఓటర్లు		
	పురుషులు	మహిళలు	మొత్తం	పురుషులు	మహిళలు	మొత్తం
బోధన్ అర్బన్/రూరల్	1,282	780	2,062	234	211	445
రెంజల్	304	131	435	09	04	13
ఎడపల్లి	368	205	573	31	19	50
వర్ని	252	118	370	22	20	42
కోటగిరి	161	86	247	22	11	33
రుద్రూర్	235	114	349	26	23	49
చందూర్	141	63	204	11	06	17
మోస్రా	149	55	204	04	04	08
సాలూర	241	87	328	21	11	32
పొతంగల్	179	80	259	11	01	12

ఘనంగా పదో తరగతి విద్యార్థులకు వీడ్కోలు



శ్రీ భాషిత పాఠశాలలో నిర్వహించిన సమావేశానికి హాజరైన జబర్దస్త్ ఫేమ్ సద్దాం, పులి

పెర్కిట్: ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని పెర్కిట్ శ్రీ భాషిత పాఠశాలలో ఆదివారం పదో తరగతి విద్యార్థులకు వీడ్కోలు సమావేశం నిర్వహించారు. కార్యక్రమానికి జబర్దస్త్ టీవీ షో ఫేమ్స్ సద్దాం, పులి ముఖ్య అతిథులుగా హాజరై ఆట, పాటలతో విద్యార్థులను అలరించారు. అలాగే పాఠశాల కరస్పాండెంట్ పోలపల్లి సుందర్ పదో తరగతి విద్యార్థులకు దిశా నిర్దేశం చేశారు. అనంతరం విద్యార్థులు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బాల్కొండలో..

బాల్కొండ: మండల కేంద్రంలోని కృష్ణవేణి పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు ఆదివారం ఓ



కృష్ణవేణి పాఠశాలలో నృత్యాలు చేస్తున్న విద్యార్థులు

ఫంక్షన్ హాల్‌లో వీడ్కోలు సమావేశం నిర్వహించారు. విద్యార్థులు పరీక్షలపై భయం వీడాలని ప్రిన్సిపాల్ విజయ్ కర్తన్ సూచించారు. అనంతరం విద్యార్థులు చేసిన నృత్యాలు అలరించాయి. ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఇసుకపై చర్చలకు సిద్ధమా..



ఏర్గట్లలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులు

మోర్తాడ్: బాల్కొండ నియోజకవర్గంలో ఇసుక ధరల విషయంలో తమ పార్టీ నాయకులపై కాంగ్రెస్ పార్టీ నేత ముత్యాల సునీల్‌రెడ్డి చేసిన ఆరోపణలపై చర్చలకు సిద్ధమా అని ఏర్గట్ల మాజీ ఎంపీపీ కొలిప్యాక ఉపేంద్ర, పార్టీ మండల అధ్యక్షుడు రాజాపూర్ణనందం సవాల్ విసిరారు. ఏర్గట్ల మండల కేంద్రంలోని తెలంగాణ తల్లి విగ్రహం ఎదుట ఆదివారం విలేకరులతో మాట్లాడారు. తమ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు ఒక్కో ట్రాక్టర్ లోడ్‌ను రూ.6వేలకు విక్రయించారని ఆరోపించారని వెల్లడించారు. ఇప్పుడు తప్పుడు వే బిల్లులతో అధిక ట్రిప్పులు తరలిస్తున్నారని ఆరోపించారు. నిబంధనలకు విరుద్ధంగా జేసీబీ ఏర్పాటు చేసి అధిక ట్రిప్పులు తరలించారని అన్నారు. ఇసుక ధర, రవాణా విషయంలో చర్చలకు సిద్ధమైతే తెలంగాణ తల్లి విగ్రహం ఎదుట చర్చలకు రావాలని సూచించారు.

ఆధ్యాత్మికం

అంకాపూర్ హనుమాన్ మందిరంలో..



పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్న విద్యారణ్యస్వామి

వేల్పూర్: వేల్పూర్ మండలం అంకాపూర్‌లో నూతనంగా నిర్మించిన హనుమాన్ మందిరంలో శ్రీ దాసాంజనేయ విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమం వైభవంగా నిర్వహించారు. హంపి విరూపాక్ష విద్యారణ్యస్వామి చేతుల మీదుగా విగ్రహ ప్రతిష్ఠాపన చేశారు. గ్రామ పురోహితుడు అవధాని సుధీర్‌శర్మ ఆధ్వర్యంలో వేద పండితులు యజ్ఞం, ప్రత్యేక పూజాకార్యక్రమాలు చేపట్టారు. ఆలయం ఎదుట ధ్వజస్తంభాన్ని ప్రతిష్ఠించారు. భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో వీడీసీ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

వైభవంగా విగ్రహ ప్రతిష్ఠాపన

రుద్రూర్: పొతంగల్ మండలంలోని కారేగాం శివారులో పునర్నిర్మించిన స్వయంభూ మహాదేవ ఆలయంలో ఆదివారం విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఈ వేడుకలు మూడు రోజుల పాటు వైభవంగా కొనసాగాయి. యాగశాల ప్రవేశం, మహా సుదర్శన హోమం, మహా చండీ హోమం, మహా కుంభాభిషేకం, ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు అన్నదానం నిర్వహించారు. జగద్గురు భీమ శంకర లింగా శివాచార్య మహరాజ్, సద్గురు శివానంద్ శివాచార్య స్వామి, మల్లికార్జున శివాచార్య స్వామి, సిద్ధి లింగప్ప స్వామిప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీ బీబీ పాటిల్, మాజీ ఎమ్మెల్యే యెండల లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.



కారేగాంలో పూజలు చేస్తున్న స్వాములు

నేడు ప్రత్యేక పూజలు

ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని నవనాథ సిద్ధుల గుట్టపై ఉన్న శివాలయంలో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అలాగే స్వామివారి ఉత్సవ విగ్రహాలను ఆలయ పరిసర ప్రాంతాల్లో పల్లకిసేవ నిర్వహిస్తామని సభ్యులు తెలిపారు.

మాక్లూర్‌లో చికెన్ మేళా



చికెన్ మేళాలో భోజనం చేస్తున్న గ్రామస్తులు

మాక్లూర్: మండల కేంద్రంలో వెన్‌కాబ్, సనా చికెన్ సెంటర్ల ఆధ్వర్యంలో ఆదివారం చికెన్ అండ్ ఎగ్ మేళా నిర్వహించారు.ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ.. మన ప్రాంతంలో బర్డ్ ఫ్లూ వైరస్ లేదని, ఒకవేళ ఉన్నా 70 డిగ్రీల ఉష్ణోగ్రత వద్ద ఉడికించడం వల్ల వైరస్ పూర్తిగా నాశనం అవుతుందని అన్నారు. అనంతరం ప్రజలకు చికెన్ ఫ్రై ముక్కలు, ఎగ్ స్నాక్స్‌ను ఉచితంగా పంపిణీ చేశారు. చికెన్ సెంటర్ యజమానులు పాల్గొన్నారు.

పురోహితులకు అవార్డులు

ఇందల్వాయి: మండలంలోని నల్లవెల్లి వేంకటేశ్వర స్వామి ఆలయ అర్చకుడు బోనాల నటకృష్ణ, ఇందల్వాయి రామాలయ అర్చకుడు కాందళై రాజగోపాలచారిలకు ఆస్ట్రో గ్లోరీ అవార్డులు దక్కాయి. ఇంటర్‌నేషనల్ ఆస్ట్రో వైదిక ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఉత్తరప్రదేశ్‌లోని అయోధ్యలో ఆదివారం నిర్వహించిన ఓ కార్యక్రమంలో వారు ఈ అవార్డులను అందుకున్నారు. జ్యోతిష్య శాస్త్రానికి వారు చేస్తున్న సేవలకు గుర్తింపుగా వారికి ఈ గౌరవం దక్కింది.

ఘనంగా బోనాల ఊరేగింపు



బోనాలను ఊరేగిస్తున్న భక్తులు

నవీపేట: మండల కేంద్రంలో ముదిరాజ్ సంఘం సభ్యులు ఆదివారం బోనాల ఉత్సవాలను వైభవంగా నిర్వహించారు. ప్రతి ఏడాది గ్రామ శివారులోని పంట పొలాల్లో నిర్మించిన పెద్దమ్మ తల్లి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తామని సభ్యులు తెలిపారు. సంఘ సభ్యులు, భక్తులు బోనాలను ఊరేగించి అమ్మవారికి సమర్పించారు. ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు.

ఘనంగా పెద్దమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠాపన



పెద్దమ్మ తల్లికి పూజలు చేస్తున్న వేముల ప్రశాంత్‌రెడ్డి, ఈరవత్రి అనిల్

బాల్కొండ: మండల కేంద్రంలో ముదిరాజ్ సంఘ సభ్యులు నూతనంగా నిర్మించిన ఆలయంలో పెద్దమ్మ తల్లి విగ్రహావిష్కరణ వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఆలయంలో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. విగ్రహావిష్కరణ వేడుకల్లో ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి, టీఎస్ఎండీసీ చైర్మన్ ఈరవత్రి అనిల్, కాంగ్రెస్ పార్టీ బాల్కొండ నియోజకవర్గ ఇన్‌చార్జి ముత్యాల సునీల్‌రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో భక్తులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

రిజర్వేషన్ల విప్లవం రాబోతోంది



సమావేశంలో మాట్లాడుతున్న బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి

- రాష్ట్రాన్ని అప్పులపాలు చేసిన ఘనత మాజీ సీఎం కేసీఆర్‌దే
- బాల్కొండ, ఆర్మూర్ నియోజకవర్గాల పట్టభద్రుల సమావేశంలో బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి

కమ్మర్‌పల్లి/ పెర్కిట్/ మోర్తాడ్: సీఎం రేవంత్‌రెడ్డి సారథ్యంలోని ప్రజా ప్రభుత్వం త్వరలో రిజర్వేషన్ల పరంగా విప్లవం తీసుకు రాబోతోందని మాజీ మంత్రి,బోధన్ ఎమ్మెల్యే పి సుదర్శన్‌రెడ్డి అన్నారు. ఆదివారం కమ్మర్‌పల్లి మండల పరిధిలోని లలితా గార్డెన్స్‌లో, ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని పెర్కిట్‌లో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన బాల్కొండ, ఆర్మూర్ నియోజకవర్గ పట్టబద్రుల సమావేశానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఏళ్ల పాటు అన్యాయానికి గురైన తెలంగాణ ప్రజలు బాగుపడతారని ఏఐసీసీ అధినేత్రి సోనియా గాంధీ తెలంగాణ రాష్ట్రాన్ని ఇస్తే, మాజీ సీఎం కేసీఆర్ రాష్ట్రాన్ని అప్పుల పాలు చేశారని ధ్వజమెత్తారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన ఏడాదిలోనే రూ. 21 వేల కోట్ల రైతు రుణమాఫీ, రూ. 12 వేల కోట్లు రైతు భరోసా ఇచ్చిందని వెల్లడించారు. శాసన మండలిలో విద్యార్థుల భవిష్యత్ గురించి మాట్లాడేవారు కావాలని పార్టీ అభ్యర్థి, విద్యావంతుడు నరేందర్‌రెడ్డికి ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఫాంహౌస్‌కే పరిమితమైన బాస్ పాలన కావాలా, ప్రజల్లో ఉండే నాయకుడి పాలన కావాలో పట్టభద్రులే తేల్చుకోవాలని వర్ధన్నపేట ఎమ్మెల్యే నాగరాజు అన్నారు. కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి సునీల్ కుమార్ మాట్లాడుతూ.. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన వెంటనే 55 వేల ఉద్యోగాలను కల్పించిందని అన్నారు. కార్యక్రమాల్లో ఎండీసీ చైర్మన్ ఈరవత్రి అనిల్, సీడ్ కార్పొరేషన్ చైర్మన్ అన్వేష్‌రెడ్డి, మహబూబాబాద్ ఎమ్మెల్యే భూక్య మురళి నాయక్, ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందాన్, అంతిరెడ్డి రాజారెడ్డి, వేణుగోపాల్‌యాదవ్, అరికెల నర్సారెడ్డి, రమేశ్ రెడ్డి, వినయ్‌రెడ్డి, మార చంద్రమోహన్, సాయిబాబాగౌడ్, యాల్ల సాయారెడ్డి, పండిత్ పవన్, రవి గౌడ్, కాశీరాం తదితరులు పాల్గొన్నారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి నరేందర్‌రెడ్డి విజయానికి కృషి చేయాలని వర్ధన్నపేట ఎమ్మెల్యే నాగరాజు సూచించారు. ఏర్గట్ల మండల కేంద్రంలో పట్టభద్రులతో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో శివన్నోల్ల శివకుమార్, సోమ దేవారెడ్డి, గడ్డం జీవన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వర్ధన్నపేట ఎమ్మెల్యే నాగరాజు

కుందకుర్తిలో ప్రచారం

రెంజల్: కాంగ్రెస్ ఎమ్మెల్సీ అభ్యర్థి నరేందర్‌రెడ్డికి మద్దతుగా మండల కాంగ్రెస్ నాయకులు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీచేస్తున్న నరేందర్‌రెడ్డికి ఓటు వేయాలని మాజీ ఎంపీపీ, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మొబిన్‌ఖాన్ కోరారు. మండలంలోని నీలా, కందకుర్తి గ్రామాల్లోని పట్టభద్రులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. నాయకులు సాయారెడ్డి, జావీద్, రాములు, గయాసుద్దీన్. ధనుంజయ్, ఖుద్దూస్ తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా ముగిసిన టీజీ సెట్



బోధన్‌లో పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్



ఎడపల్లిలో పరీక్ష రాస్తున్న విద్యార్థులు

బోధన్/ ఎడపల్లి: గురుకుల విద్యాలయాల్లో 5 నుంచి 9వ తరగతి ప్రవేశ అర్హత కోసం ఆదివారం పట్టణ కేంద్రంలోని మైనార్టీ బాలుర రెసిడెన్షియల్ స్కూల్, ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన టీజీ సెట్ కేంద్రాన్ని సబ్ కలెక్టర్ వికాస్ మహతో సందర్శించారు.డివిజన్ పరిధిలోని వివిధ మండలాల విద్యార్థులు ప్రవేశ అర్హత పరీక్షకు హజరయ్యారు.పరీక్షా గదుల్లో విద్యార్థులు రాస్తున్న తీరును సబ్ కలెక్టర్ పరిశీలించారు. విద్యార్థుల కోసం ఏర్పాటు చేసిన సౌకర్యాల పై ఆరా తీశారు. ఎడపల్లి మండల కేంద్రంలోని తెలంగాణ రెసిడెన్షియల్ పాఠశాలలో విద్యార్థులు టీజీసెట్ పరీక్ష రాశారు. పరీక్ష కేంద్రంలో 190 మందికి 186 మంది హాజరుకాగా, నలుగురు గైర్హాజరైనట్లు సెంటర్ అధికారి గంగాశంకర్ తెలిపారు.

వెండితెర తెలుగు/హిందీ/ఇంగ్లిష్



పీవీఆర్ మల్టీప్లెక్స్ (ఆర్మూర్)

- స్క్రీన్-1 – ది డెవిల్స్ చైర్(తెలుగు)-10.40, రామం రాఘవం(తెలుగు)-1.55, జాబిలమ్మ నీకు అంత కోపమా(తెలుగు)-4.30, 7.20, 10.10
- స్క్రీన్-2 – రిటర్న్ ఆఫ్‌ది డ్రాగన్(తెలుగు)-10.15, 4.00, 7.10, 10.20, బాపు(తెలుగు)-1.25
- స్క్రీన్-3– జాబిలమ్మ నీకు అంత కోపమా(తెలుగు)-10.10, రిటర్న్ ఆఫ్‌ది డ్రాగన్(తెలుగు)-1.00, ఛావా(హిందీ)-4.10, బాపు(తెలుగు)-7.30, తండేల్(తెలుగు)-10.05
- స్క్రీన్-4 బాపు(తెలుగు)-10.30, తండేల్ (తెలుగు)-1.05, సంక్రాంతికి వస్తున్నాం (తెలుగు)-4.10, ఛావా (తెలుగు) - 7.10, 10.30

ఉషా ప్రసాద్ మల్టీప్లెక్స్ (గీతా ఏషియన్)

- స్క్రీన్-1 జాబిలమ్మ నీకు అంత కోపమా -11.00, 1.40, 7.30 రిటర్న్ ఆఫ్‌ది డ్రాగన్-4.30, 10.20
- స్క్రీన్-2 ఛావా(హిందీ)-11.00,1.40,4.40, 7.30, 10.20
- స్క్రీన్-3 తండేల్(తెలుగు)-1.45, 4.40, 7.30 బాపు(తెలుగు)-10.30

పీవీఆర్ మల్టీప్లెక్స్ (వేణు మాల్)

- స్క్రీన్-1 రిటర్న్ ఆఫ్‌ది డ్రాగన్(తెలుగు)-10.15, 4.00, 7.10, 10.20 బాపు(తెలుగు)-1.25
- స్క్రీన్-2 ఛావా(హిందీ)-10.00, 7.20, 10.40 రిటర్న్ ఆఫ్‌ది డ్రాగన్(తెలుగు)-1.20 జాబిలమ్మ నీకు అంత కోపమా -4.30
- స్క్రీన్-3 జాబిలమ్మ నీకు అంత కోపమా-10.30 ఛావా(హిందీ)-1.20 తండేల్(తెలుగు)-4.40, 10.20 బాపు(తెలుగు)-7.45
- స్క్రీన్ -4 ది డెవిల్స్ చైర్(తెలుగు)-11.30 రామం రాఘవం(తెలుగు)-1.45 ఛావా(హిందీ)-4.20 సంక్రాంతికి వస్తున్నాం(తెలుగు)-7.40 జాబిలమ్మ నీకు అంత కోపమా-10.40

లలితామహల్ తండేల్(తెలుగు)

దేవి జాబిలమ్మ నీకు అంత కోపమా(తెలుగు)-11.15, 6.15 రిటర్న్ ఆఫ్‌ది డ్రాగన్(తెలుగు)-2.15, 9.15

నటరాజ్ ఛావా(హిందీ)

విజయ్ సంక్రాంతికి వస్తున్నాం (తెలుగు)

బంగారం ధరలు (10గ్రాములు)

24 క్యారెట్స్	89,700	వెండి(కిలో)	1,02,000
22 క్యారెట్స్	82,710		

– నిజామాబాద్ బిజినెస్

మాంసం ధరలు

చికెన్	ధరలు (కిలోకు)		
		డ్రెస్డ్	160
		లైవ్	100
స్కిన్‌లెస్	180	మటన్	800